

# ముగ్గురమ్మల మూలపుటమ్మ!

పిన్ని కూతురు జానకి, బాలాంబను చూడటానికి వచ్చింది. జానకి వేలు విడిచిన మేనత్త కూతురు పెళ్లిట. పెళ్లి కూతురూ తానూ ఒకే యీడువారట.

''బాలా! బావున్నావా? పరీక్ష వ్రాశావా? చిన్నప్పుడొకచోట పెరిగామే! నిన్ను చూస్తే స్వంత చెల్లెల్ని చూసినట్టుంటుంది. నేను పెళ్లికొచ్చాలే. ఆడపెళ్లి వారితో వచ్చా. అత్తకూతురే పెళ్లికూతురు. అత్త త్రిపురకు యీవూళ్లో సాయపడేవారు చాలామంది వున్నారని అందుకనీ వూళ్లో చేస్తామని, వియ్యాలవారితో చెప్పుకున్నది.''

''కూర్చో జానూ. నేను గుర్తుండవచ్చానా అనుకున్నా! మరిచిపోకుండా వచ్చావే. పిన్నీ బాబాయీ బావున్నారా? చెల్లెలు భాను బావున్నదా? నీతో రాలేదూ? అయిపోవచ్చింది'' బాలాంబ చిరిచాప పరిచింది.

జానకి చాపమీద కూచున్నది. ఇటూ అటూ తిరుగుతూ వంట చేస్తున్న బాలాంబను చూస్తున్నది.

''కాలేజీ కెళ్లాలేమో. వంటకూడా చెయ్యాలీ? టైమ్ సరిపోతుందీ?'' అనడిగింది.

''కాళ్లు చేతులూ కడుక్కురా. ఉప్మావున్నది. తిందువుగాని. కాఫీ చేసేస్తున్నా. అదే స్నానాల గది. స్నానం చేస్తావా? పెళ్లి యెప్పుడూ?'' పప్పుకూర చూస్తున్నది బాల.

''రాత్రికి పెళ్లి, తెల్లారుజామున అప్పగింతలూ అయిపోతాయి. రానుపోనూ బస్సు మాట్లాడారు. స్నానమెలా చేయనూ? మార్చుకోటానికి గుడ్డలేవీ? నా సంచీ పెళ్లివారి దగ్గరుండిపోయింది. ఇప్పుడు వుప్మా యెందుకులే

బాలా. కబుర్లు చెప్పుకుందామని వచ్చాను. యెనిమిదిన్నరయింది'' అన్నది జానకి.

'ఫరవాలేదు. పిన్ని వచ్చినప్పుడు, తన చీర యిక్కడపడేసి వెళ్లింది. చాకలికేశాము. చాకలి తరవాత తెచ్చాడు. అది కట్టుకుందువుగాని. జాకట్టు నీదే వేసుకో. లేమరీ. సాగదీయాలా. ఆడబడుచువన్నాగాదు. అప్పవూ'' తిరగమోత పెడ్తున్నది బాల.

జానకి నవ్విలేచి స్నానాల గదివేపు వెళ్లింది. బాల తువాలూ, సబ్బూ అందించింది. జానకి వచ్చేలోపల వంటైంది. పొయ్యి ఆర్పింది. కుంపట్లో కాసిని నిప్పులున్నాయి.

జానకి రాగానే కాఫీ వుప్మా యెదురుగా పెట్టింది. అద్దం దువ్వెనా, తలనూనె బిళ్లబొట్టూ, పౌడరూ వుంచింది పక్కగా.

''నీకు టైమ్ కావటం లేదూ?'' తింటూ అడిగింది. ''చాలా బావున్నదే వుప్మా. అన్నీ సరీగ్గా పడినై. కాఫీ బావుంది. యెప్పుడు నేర్చా యివన్నీ.'' తల దువ్వుకోటానికి తలనూనె మూతతీసింది జానకి. అద్దంలో చూసుకుంటూ పాపట తీసుకుంటూ అన్నది.

''యేమిటడిగావు బాలా! మా అమ్మా నాన్నా బావున్నారా అనా? ఆ. ఆ. రాళ్లల్లే వున్నారు. తిట్టుకుంటూ వోపికకొద్దీ కొట్టుకుంటూ గూడాను. 'పెళ్లిచేసి పంపించేయి మహాతల్లీ. మీ సంగ్రామం నే చూడలేను. పోటు మాటలూ, యీటెలంటి మాటలతో దెప్పిపొడవటం, వెక్కిరించటం వినలేను చూడలేను చెవులు ఘళ్లు పడుతున్నై'' అని మొత్తుకుంటే వినిపించుకోదు మా అమ్మ. నాన్నేమో పొలాలు, క్రయ విక్రయాలూ, కౌలుకివ్వటం, ఫలసాయం యెంత వస్తుంది. యాడాదికి వచ్చే ఐవేజూ మాట్లాడుతాడు. యేదో సంబంధం

భూస్వామి నాలుగోసంబంధం కాళ్లకాడి కొచ్చిందంటాడు. పిల్లనిచ్చేద్దాము చేసిపెట్టేవారున్నారు అత్తా, విధవాడపడుచూ అని నవ్వుతాడు. దాంతో అమ్మ తాటి ప్రమాణాన లేస్తుంది. '' ఆ పల్ల బర్రెకి, వయసు మళ్లుతున్నవాడికి, రంభవంటి నా కూతుర్నివ్వాలా? నీకు నన్నిచ్చారుగా చాలు. ఓ అందం చందం లేదు. నీటూ గోటూ లేవు. ఠీకూ ఠాకూ లేదు. చెట్టెక్కి బాదమాకులు కోసి సంచీవంటి ధోవతీ కొంగులో పొందికగా దూర్చటం డాబుగా కనిపిస్తుంది. దర్పం అసలే లేదు. ఉద్యోగమా? హోదా వున్నదా? మాటిచ్చారంటేనా?'' అని మీదికెళ్లింది. పద్నాలుగేళ్లుగా అంటుంది. నాన్న నవ్వి ''యిరవై రాలా నీకూతురుకీ?'' అంటాడు. దాంతో ద్వంద్వ యుద్ధం మొదలు. అడ్డుపడ్డానా ఆసద్దులన్నీ నాకు దక్కుతాయి. చాలా! ఇరుగింటికీ పొరుగింటికీ పోనీయదు. వెళ్లానా? ''యెక్కడికెళ్లావే! ఇంట్లో కాలునిలవదు. ఇంటి గుట్టంతా లాగారా పొరుగు వారూ? గురివింద గింజ తన నలుపెరుగదనీ. యెవడికి తెలియదు వీరి సంగతి!'' అని బుగ్గలు పిండి నెత్తిన మొట్టుతుంది. చెల్లి యేడుస్తూ అడ్డమొస్తే దాన్నీ బాదుతుంది. దాన్ని రెక్కబట్టుకు బర బరా లాక్కెళ్లి గదిలో పడేసి గొళ్లెం పెడుతుంది. 'యెన్నాళ్లీ ఖైదూ? పెళ్లి చేసేయి పోతా' అంటే 'వుద్యోగస్తుడిని చూస్తున్నాను' అన్నది. '' ఈ పల్లెటి గొడ్డునే వుద్యోగస్తుడు వరిస్తాడు?' అన్నా. దాంతో, 'ముదినాపసాని మాటలూ నువ్వూ. నోరు మూస్తావా లేదా? గుడ్లు పీకేను' అని బాదింది.'' జడఅల్లటమై కుప్పెలందుకుని జడచివర పెట్టి అల్లుతూ నవ్వింది జానకి.

''కుప్పెలు చాలా బావున్నాయి జానీ. మెరుస్తున్నాయి. కొత్తవా?'' అప్పడాలు నిప్పులమీద కాల్చి నెయ్యిరాచి పళ్లెంలో పెడ్తున్నది బాల. ఒకటి జానకి ముందుంచింది ఆకులో.

''కొత్తవే. రెండో సంబంధంవాడు వచ్చి చూసి వెల్లాడు. వుద్యోగే. వాళ్లమ్మ.

''పిల్లవంటిమీద కాసినైనా నగలు పెట్టాలి.'' అన్నదిట. కుప్పెలూ, చామంతి బిళ్లా, నాగరం, చేతులకి రెండేసి గాజులూ, పాదాలకి పాంజేబులూ, మెళ్లో ఒంటిపేట గొలుసూ, చేయించి పెట్టింది అమ్మ.'' జడవెనక్కేసుకున్నది.

''బడికెళ్లటం లేదూ?'' అనడిగింది బాల.

వడియాలు వేయిస్తున్నది. మినప్పిండీ, బియ్యంపిండీ, గుమ్మడిముక్కల వడియాలూ వేయించింది. కాసిని పళ్లెంలో వుంచి జానకి ముందుంచింది.

'' ఇవన్నీ యెందుకే? మధ్యాహ్నం విందున్నదిగా!'' అంటున్నదిగానీ జానీ తింటూనే అన్నది. ''బడా? బడియేనాడో మానేశా. పల్లెటూరు గదూ. ఐదోక్లాసు వరకే. యెలిమెంటరీ స్కూలు యేనాడో వదిలేశా.''

''హైస్కూలు కెళ్లవూ?''

''పోనిస్తుందీ మా అమ్మ. యెవడో యెత్తుకుపోతాడంటుంది. అన్నీ పాడుమాటలే. నోరు మహాచెడ్డది. మీ అమ్మే మంచిది. నిన్ను హైస్కూలు గూడా వదలనిచ్చింది. దీని తరవాతేం చదువుతావు? బియె చదువుతావా? బియ్యప్పిండి వడియాలూ, గోదుమ పిండి వడియాలూ చాలా రుచిగా వున్నాయి బాలా. చామదుంప వడియాలూ, కందవడియాలూ గూడా పెడ్తారా?''

'' ఆ. ఆ. పెడతాము. మా అమ్మ పెడుతుందీ. హెల్పర్‌గా నేనూ నేర్చా. అసలు చదువుకోనివ్వదు'' అని బాగా నవ్వింది బాల.

''నవ్వుతావెందుకే?''

కళ్ళ నీళ్లొస్తే పమిటతో అద్దుకున్నది బాల.

''క్షణం కూచోనివ్వదు. కంటియెదుటినించి పోనివ్వదు. అరుస్తూనే పనిచేయిస్తుంది. మా అమ్మ కసలు పనీవంటా అంటేనే యెల్లర్జీ. 'చాలా గొప్పవాడి కూతుర్ని! వీళ్లకి వండి వార్చాలా? ఆ యీడుకి నేను అత్తింటికెళ్లి గొడ్డు చాకిరీ చేశాను' అని గొణుక్కుంటుంది. ఈ మధ్య కొత్త తిట్లు వింటున్నా. నేనిదవరకలాటివి వినలేదు. కొన్ని అసలు అర్థమే గాలేదు. కొట్టదు అంతే. చాలా పదును నాలుక.''

''పని బాగానే అందుకుంటుంటివిగా. యేమీ కావాలని అడగవు. పెదనాన్న పోయేటప్పటికి పెద్దమ్మకి మరీ స్వేచ్ఛ లభించింది. పెదనాన్న వుండి వుంటే కొంతైనా అదుపు చేసేవాడు. యెందుకు యీసడిస్తావనవూ?'' మంచి నీళ్ల తాగింది. కుప్పెలు తుడిచింది.

''బాగా చెప్పావు జానీ. కారణం నా పేదబుర్రకి తెలిసిరాలేదుగానీ మెల్లిగా వూహించగలిగాను.'' అన్నీ సర్దిపెట్టి అల్మర మూసి వచ్చింది బాల.

''యేమి తెలిసింది? ఊహా కందిందేమిటి?''

'' ఈ మధ్య తనదూరపు బంధువొకడు, మేనల్లుడి వరస తరచూ దర్శనమిస్తున్నాడు. నన్ను తనతో ఫ్లర్ట్ చేయమంటాడు. అమ్మ వెళ్లమననిదీ నేను వెళ్లను గదా జానీ. వాడు వచ్చి వెళ్లగానే యీవిడ రై రై మని నామీదికి లేస్తుంది. సినిమాకి పంపమని వెంటబెట్టుకెళ్లి, తెచ్చి దింపిపోయాడు. ఈవిడ చిందూ డాన్సుచేసి నన్నూ వాడినీ తిట్టింది. వంచకుడట. ''బుజ్జి పాపవా? అన్నం తిని పొమ్మనలేవూ. నోరుబడిందా?'' అని మొదలెట్టి నింద్యాగ్రామ్యం వాడుతుంది. అవన్నీ నేను కంఠస్థం చేయలేదు. వాడు రాగానే ముఖంమీదే తిట్టేయరాదూ? నిలేసి అన్ని సందేహాలు తీర్చుకోరాదు. వాడు తగ్గవాడే. బుద్ధిమంతుడినని

నటిస్తూ వోనాడు కూచుంటాడు. గబగబా లేచి టిఫిన్ కాఫీ వాడి ముందుంచుతుంది. వాడు తినేస్తాడు. తలపట్టిపోయి అమ్మనే అడిగా''.

''యెందుకలా టిఫిన్ పెడతావూ? అన్నం తినిపో అని నువ్వడగలేవూ?''.

అడిగిందట. నేను లేనప్పుడొచ్చినప్పుడు నిలేసిందట. ''మా అమ్మ మీ యింట్లో తినద్దన్నది. అసలు మీ యింటికే వెళ్లద్దన్నది. నేనే చూసిపోదామని వస్తూవుంటాను.'' అన్నాడట.

''యెందుకని తినవద్దన్నది?'' అని గుడ్లురిమిందట! తన తండ్రికి మతి భ్రమించటానికి మా అమ్మే కారణం అన్నాడట. మందు పెట్టి మతి విరిచేసిందట. వాళ్లమ్మకి విడాకులిప్పించిందట. తండ్రిలేకపోతే, అదుపులేక బిడ్డలేమౌతారు? చివరికాయన బైరాగుల్తో వెళ్లిపోయాడుట. దాని తరవాత యేకబిగిన తిట్టటం అలవాటు చేసుకున్నది. యెప్పుడాపుతుందా అని చూస్తూ కూచుంటా. ఆనాడు పస్తు. అరిచి అరిచి పడుకుంటుంది.'' కళ్లు తుడుచుకున్నది బాల.

''వూరుకో బాలా! నాతో పెళ్లికిరా. కాసేపన్నా సరదాగా గడుపుదాము. వుండు తలుపు చప్పుడౌతున్నది. యెవరో చూసివస్తా'' జానకి లేచి వెళ్లింది.

కుంతలా, జానకీ నవ్వుతూ లోపలికి వచ్చారు. కుంతల మంచి దుస్తులేసుకున్నది. తల్లో పూలచెండూ, అత్తరు వాసనా. చెవులకు లోలకులూ చేతిలో రుమాలూ.

''బావున్నావా బాలా? శాన్నాళ్లయింది నిన్ను చూసి. చిన్నప్పుడు చింతలూ చికాకులూ లేక ఆడుకునే వాళ్లం. వుయ్యాల లూగే వాళ్లం. అట్లాగే వుండిపోతే బాగుండేదనిపిస్తుంది. నేను పెళ్లికి వచ్చాను. రాత్రి ఒంటిగంటకి పెళ్లి. పెళ్లికొడుకు నాకు అన్నాయి అవుతాడు. మొదటి పెదనాన్న కొడుకు. పెళ్లి కూతురేమో

ఎలక్ట్రానిక్స్ పాసైంది. విదేశం వెళ్లే ప్రయత్నంలో వున్నది. పెళ్లిచేసి పంపాలని నిశ్చయించారు.''

''కూచో కుంతలా. ఇవాళ సుదినం. నా అభిమానులిద్దరొచ్చారు అనుకోకుండా. యేమైనా తింటావా?''

చాపమీద పొందికగా కూచున్నది కుంతల. పక్కనే జానకీ కూచున్నది.

''అత్తయ్య యింట్లో లేదా? యిల్లు నిశ్శబ్దంగా వున్నది? ఇప్పుడేం తినలేను. నేను విడిదినించే వస్తున్నా. తొమ్మిదింటికి వుప్మా కాఫీ యిడ్లీ అందించారు. మరొక యిద్దరమ్మాయిలు వాళ్ల బంధువులిటువేపున్నారు. చూసివద్దాము వస్తారా అని అడిగారు. అటువేపే మా బంధువుల యిల్లూ వస్తానని చెప్పి మా అమ్మ పర్మిషన్‌తోనే బయలుదేరి వచ్చా. నన్ను ఒంటరిగా పోనిస్తుందీ? పెళ్లికొడుకుని చేయటం అనే సంబరంలోవుండి పొమ్మన్నది. ఆడపెళ్లి వారు రాగానే గమ్‌కీలు చేయాలిట. లేకపోతే స్టేటస్ పోతుందిట'' అని నవ్వింది కుంతల. వల్లెవాటు అంచులు దిద్దుకున్నది. కర్చీఫ్‌తో మొహం అద్దుకున్నది. పూలచెండు దిద్దుకున్నది.

''అత్తయ్యా! నీకు తెలియదూ? నేను పందెం కాస్తా! పట్టుమని అయిదు రోజులు యింటిపట్టునుంటుందీ? యడమకాలు దురదపెట్టదూ!''

''తక్కిన కుటుంబ సభ్యులేరీ?'' అన్నివైపులా చూస్తూ అడిగింది కుంతల.

''పన్నెండున్నర కొస్తారు. అన్నేమో పోటీలో పాల్గొనాలిట. రిహార్సల్స్‌కి వెళ్లాడు. అక్కేమో పిల్లలకి తర్ఫీదివ్వాలిట. స్కూల్ ఆనివర్సరీ వస్తున్నదట. ఆటలపోటీలూ, డ్రిల్లూ, నాటకం, కోలాటం తప్పులు పోకుండా చేయించాలిట. యేడుగంటలు కాకముందే స్కూలుకి వెళ్లిపోయింది. నువ్వు మెట్రిక్ పరీక్షకి

అప్పియరైనావా? గట్టెక్కావా?'' బాల అడిగింది.

కుంతల తల వెనక్కు వాల్చి, '' ఆహాహా!'' అని నవ్వింది. మెడకున్న చక్కని నెక్లెస్ మెరిసింది. లోలకులాడినై. పమిట దిద్దుకున్నది.

'' ఆ పరీక్ష సంగతి యెత్తకుండా వుంటే పరువు నిలుస్తుంది బాలా. మా అమ్మ చదువుకోనిస్తేనా? పుస్తకం చేతులో కనబడగానే నసమొదలూ, లేదా సోదీ, ఒక్కరే సంతానమైతే యిదే యిబ్బంది. కంటికి కనబడక పోగానే పెద్దగా అరుస్తుంది.''

''యెక్కడికి చచ్చావేవ్! క్షణం ఓ చోట వుండలేవేం? కాలునిలవదేం?'' అని అందుకుంటుంది. మామిడి పిందెలు తరిగి ముక్కలు చేసి వుప్పు కారం అద్ది కటుకూ కటుకూ తింటూ చదువుకోనివ్వదు. అన్నీ తనే చేయాలంటుంది.'' ఇంకా అరోయేడేనా నాకూ? పెద్ద దాన్నయాగా?'' అంటే వినిపించుకోదు. తలదువ్వి జడేసుకుంటే, '' ఆ యెగదువ్వటమేమిటీ బైరాగిదానిలాగా?'' అంటుంది. పొద్దు కుంకుతుండగా పూలుకోసి కత్తెర బెండుగుచ్చి పెట్టుకుంటా. రాత్రికి విచ్చి మంచివాసన తలమీదుగా వస్తుంది.''

''సినిమాలో చేరాలని చెప్పకుండా పారిపోతావా యేమే?'' అంటుంది. అన్నంలోకీ అంతే. తను చేసినవే తినాలి. వంక పెట్టినా తిడుతుంది.'' నీ తాత ముల్లె యిచ్చిపోయినాడా? నీ అబ్బ కోశాగారం నింపిపోయాడా? తలకు మించిన అప్పులు చేసి, నిలువనీడలేకుండా చేసి ప్రాణంమీదికి తెచ్చుకున్నాడు. ''పిల్ల పెళ్లెట్లా?'' అని నేను లబలబలాడితే, ''సినిమాలోకి తీసుకుంటారట నన్ను. ఛాన్సు రాగానే లక్షలు గణిస్తాను. నీవాళ్లిస్తారా, వాళ్లూ నీ పంచనే చేరారు'' అన్నాడు నీ అబ్బ. నిమోనియా వచ్చి మూడ్రోజులలో పక్షి ఆకాశంలోకి యెగిరిపోయినట్టు పోయాడు. గొప్పలకు పోయి యిలా చేశాడు. పెట్టింది తిను.

పారేయకు. మొగుడిని ఒకడిని రానీ. వాడెంత సంపాయిస్తాడో చూసి, నీకు కావాల్సినవి చేసిపెడతా'' అంటుంది. బెనారస్ మెట్రిక్ ధర్మమా అని రెండుసార్లు కాశీ వెళ్లి, కాశీ విశ్వేశ్వరుడిని, అన్నపూర్ణాదేవినీ చూసొచ్చాము. ఇంకోసారి వెళ్లి రావచ్చు. ఈ లోపల మా అమ్మకు నచ్చిన అల్లుడొస్తే పెళ్లౌతుంది. పరీక్ష పీడ వదిలిపోవాలని చూస్తున్నా. యెవడూ కంటికి నదరుగా కనబడడైపాయె. ఒకడిని డబ్బా అల్లే వున్నాడంటుంది. మరొకడిని బొర్రాయి అంటుంది. యెట్లా వుండాలో నాకు తెలియదు. డబ్బు పొయ్యడమైపాయె. చదువూ అబ్బటం లేదు. సంగీతం చెప్పించుకోలేము. పెళ్లిచూపులకి అరువునగలు పెట్టి, కొత్త గుడ్డలు కడితే చేసుకుంటాడా? ఈ నగలు అరువునగలే బాలా! అరువు సొమ్ము బరువు చేటు, తియ్యా పెట్టా తీపు చేటూ, అందులో పోటిపోతే అప్పుల చేటు అంటే నెత్తిన కొడుతుంది అమ్మ. ఈ కొత్త గుడ్డలు నావే. మా అన్నాయి సెంటు పూశాడు. వాడు సెంటు వాడతాడు. అమ్మేమో, ''నగలు లేకపోతే నిన్నెవరైనా గమనిస్తారా? అని యివి తెచ్చి పెట్టింది.'' అని చింత లేకుండా సరదాగా చెప్తూ నవ్వింది కుంతల.

''మీరిద్దరూ దుర్గమ్మ మామ్మని చూసొచ్చారా? యెండి వరుగై పోయిందిట. నా చిన్నప్పుడెత్తుకుని ముద్దులాడి యేదో తినిపించేది. యేదో కొనిబెట్టేది. యెన్ని ముద్దుపేర్లతో పిలిచేదీ? 'పండూ, చిన్నా! కన్నా! అమ్మన్నా. బుల్లెమ్మా. ముద్దబంతి పూవులాగా వుంటావే చిట్టీ! పెద్దయాక నన్ను చూడవస్తావా? పిచ్చి కట్టె గడసరిగాదు. మరిచిపోతావా బుజ్జీ అనేది వెళ్లి చూసొద్దామా?''

''అలాగే. మీరిద్దరూ మధ్యాహ్నం విందు కానిచ్చి రండి. నేను అన్నం తిని, యింటికి తాళం వేసి, తాళం చెవి పక్కింటి వాళ్లకిచ్చి, సాయంకాలానికల్లా వస్తానని, కాగితం మీద రాసి, వాకిలి తలుపుకి అతికించి వస్తా. అక్కయేమనదు.

అమ్మ యింకా నాలుగురోజులక్కాని రాదు. పందెం'' అని నవ్వింది, బాల.

''మీరిద్దరూ తోడున్నారని చెప్తాలే మా అమ్మతో. వీలైతే యింకో నలుగురమ్మాయిల్ని తోడు తెస్తా'' అన్నది జానకి. ''రా కుంతలా''.

''నేను యేదైనా తెస్తా. తోడున్నారని చెప్పివస్తా''

2

దగ్గరే కుగ్రామంలో వున్నది దుర్గమ్మ. ఆమె పుట్టింటివారు పసుపు కుంకం కింద యిచ్చిన నాలుగెకరాల భూమి ఆ గ్రామంలో వున్నది. మొగుడు కట్టించి యిచ్చిపోయిన పెంకుటిల్లున్నది. కొన్ని నెలలకిందే ఆ వూరు పెరిగిందని తాలూకా చేశారు. రైలు మార్గం వేశారు. బస్‌రూట్ వచ్చింది. యెలిమెంటరీ స్కూలు హైస్కూలయింది. పోలీస్ స్టేషన్ ధర్మాసుపత్రి, శంకరమఠం, శివాలయం, ఆడపిల్లల ప్రైమరీ స్కూలు ప్రమదావని అని చిన్న స్త్రీల క్లబ్బు వెలిశాయి. వూరికి స్టేటస్ పెరిగింది. డాబాలూ, మేడలూ, హోటల్సూ మెల్లిగా లేస్తున్నాయి. పుల్లప్ప టీస్టాలూ, కొండయ్య డిపార్ట్‌మెంటల్ స్టోరూ అందమిచ్చాయి. రోడ్లు పడినాయి. మునిసిపల్ పార్క్. మునిసిపల్ ఆఫీసు. బాంక్ బ్రాంచీ పెట్టారు. పోస్టాఫీసూ, పోస్టల్ చిన్న సేవింగ్స్ బాంక్, రవాణా చేసే లారీలు సందడి తెచ్చాయి.

పిల్లలంతా బిలబిలమని లోపలికొచ్చారు.

మంచంలో కూచుని వున్నది దుర్గమ్మ. పదహాడి నడుస్తున్నది. బోసినోరూ, దట్టమైన కళ్లద్దాలూ మంచం పక్కనే చేతికర్రా. తెల్లని మల్లుధోవతీ. మొహాన విభూతీ. మెళ్లో రుద్రాక్షల తావళం. వినికిడి శక్తి బాగున్నది. అరుగుదల బాగున్నది.

''మామ్మా! అమ్మమ్మా! అమ్మయ్యా. పెద్దమ్మా! దొడ్డా! ఒయ్యాయీ.'' అని మీదబడ్డారు ఆడపిల్లలు.

''మీదపడకండే భడవల్లారా! ఇన్నాళ్లకి గుర్తొచ్చానూ! దుర్గమ్మ ముసలిది చచ్చిందో బతికే వున్నదో అని యెవరైనా వచ్చి చూసి వెళ్లారా? మీదబడితే పెద్ద బండలు మీదబడినట్టు వుంటుంది. రక్తలేమి అనే వ్యాధివల్ల అలావుంటుంది అన్నాడు డాక్టరు. తుంగచాప వేసుకుని దానిమీద తగలబడండే. ముసల్ది ఆకలితో అలమటిస్తుందని యేమైనా తెచ్చారా? వట్టి చేతులతో వచ్చారా? మీ తల్లిదండ్రులేం నేర్పారే? జాణల్లారా? తిట్లూ శాపనార్థాలు నేర్పారా? ఈ చాయలకు రామని శపథం పట్టారా? డబ్బునోల్లుకు పోవటానికి గుర్తొస్తాను గదూ. వృద్ధులనూ, దైవాన్నీ, కడుపుతో వున్న అమ్మాయినీ, పసివారినీ చూడటానికి వెళ్లేప్పుడు, యేమైనా పట్టుకెళ్లాలని నేర్పారూ? లేదు. ఒక్క బిడ్డనూ నా దగ్గరుండనీయలేదు. పని చేయిస్తానుట. వాళ్లేం చేస్తున్నారే గడుగ్గాయిల్లారా? బిడ్డలను బంగారు తూగుటుయ్యాలో పెట్టి జోలపాటలు పాడుతూ వూపుతున్నారా? కాళ్లు విరిగినయ్యా? చేతులమీద బల్ల పడిందా? వుత్తరం ముక్క పడేసి, నా గతెట్లా వున్నదో తెలుసుకోలేరా? రెండు కాళ్లూ వంకర్లు పోయాయి. లేస్తే పడిపోతాను. ఒక్కల్లుడు దగుల్బాజీ నా కూతుర్ని పంపలేదు. ఒక్క దేబెకొడుకూ కోడల్ని పంపలేదు'' అని అరుస్తున్నది దుర్గమ్మ చేతులు తిప్పుతూ, తన అత్తవార్ని దుమ్మెత్తి పోయసాగింది. బీడుభూమీ, వుప్పురిసిన నేలా రాతి భూమి తన భర్తకు పంచియిచ్చి మాగాణి వాళ్లు తీసుకున్నారని దూషించింది.

ఆవిడ నోటిధాటికి ఆడపిల్లలు దిమ్మెరపోయారు. మొదట తెప్పరిల్లింది బాల. చాపలు తెచ్చి పరిచింది. అంతా కూచున్నారు.

''మామ్మా! నీ కోసం చక్రకేళీ అరటిపళ్లు ఆరూ, కిస్మిస్ పచ్చివి,

వెన్నలాగా కరిగిపోయే మినపసున్ని వుండలు నాలుగు, అల్లం మురబ్బా కొంచెం, గుల్కంద్ తెచ్చాము. సన్నగా బంగారు తీగలాగా వుండే కారప్పూస తెచ్చాము.'' అని ఆకుల్లో వుంచి ఒక పళ్లెంలో పెట్టి తెచ్చి చేతికందించింది. మంచి నీళ్ల గ్లాసు దగ్గరగా పెట్టి కూచున్నది. కాళ్లమీద రాయసాగింది.

కొంతమంది ఆడపిల్లలు దొడ్లో బంతిపూలు చూసి అటు పరుగెత్తారు. ఇద్దరు బాదం పళ్లు రాలినవి యేరి తెచ్చుకోటానికెళ్లారు. జానకీ కుంతలా వచ్చి, దుర్గమ్మ దగ్గరగా కింద కూచుని పండుతొక్కతీసి తుంపి అందించారు. కిస్‌మిస్ తుంపి తినిపించారు.

దుర్గమ్మ కడుపులో బరువుపడి చల్లబడింది. మినపసున్ని తిని మంచినీళ్లు తాగింది. భూతద్దాల్లోంచి చూసింది పిల్లల్ని.

''అట్లా వెళ్లి వంటింట్లో వుట్టిమీద గిన్నెలో అరిశలున్నాయి గిన్నె దింపి తీసుకురండి. నేతితో చేయించా నిన్ననే. ఆ గూట్లో పళ్లేలు తోమిపెట్టాను. తెచ్చి పళ్లేలలో పెట్టుకు తినండి. తక్కిన పిల్లలకి గూడా యివ్వండి. నన్ను చూసిపోదామనే వచ్చారా? మీ వాళ్లు రానిచ్చారూ! మీ కింకా పెళ్లిళ్లు కాలేదూ? పసుపుతాడేదీ? యెవడన్నా ఆశచూపి మోసగించేదాకా చూస్తూ కూచుంటారా?''

'పెళ్లీడు దాటుతున్న కొద్దీ యింకా చిన్నవాడూ గొప్పబిడ్డా అందుతాడా? యేంచేస్తున్నారే మీ వాళ్లూ గుఱ్ఱాన్ని తోలినట్లు తోలుతున్నారా మిమ్మల్నీ?''

దొడ్లో పిల్లలు కిలకిలలాడుతూ ముద్దబంతి, పొగడబంతి, సిల్కు బంతి కోసి తుంపి, అరిటినారతో బెండ్లు కట్టి తలల్లో పెట్టుకోసాగారు. వాళ్లు లోపలికి వచ్చారు. బాదంకాయలు పగలగొట్టి పప్పులు తెచ్చి పిల్లలు అందరికీ పంచారు.

'పెద్ద పెద్ద కురిడీలొచ్చాయి బాలా. బలే తీపి.'' వాళ్లకీ చక్రాలు, అరిశలు, చేగోడీలు అందించి మంచినీళ్లిచ్చారు.

దుర్గమ్మ పెద్దమ్మ నోరు కాసేపు మూతబడిందిగానీ, మళ్లా చైతన్యం వచ్చినట్లు దూషణకు వెరవలేదు. కోడళ్లూ అల్లుళ్లూ చేసిన మోసాలూ, వేరింటి కాపరాలు పెట్టించటం, నీ వంతు ఆస్తి తెమ్మనటం, దగా, డబ్బుకోసం పీకులాట, బాంధవ్యం తెంపుకుని పట్నాలకు పోవటం, సమిష్టి వ్యవసాయం మానేసి ఆస్తులు పంచుకోటం, పొలాలకు గట్లు వేయటం, భాగాలకు గోడలు కట్టటం అన్నీ దొర్లినై.

పిల్లలు కాసేపు రేడియో విన్నట్టు విన్నారు. టివి చూసినట్టు చూశారు. సినిమా రీళ్లలాగా తోచినై కథలు. దుర్గమ్మ మామ్మ అభినయం చూసి నవ్వారు. యేడిచారు. కళ్లు తుడుచుకున్నారు.

''మా అమ్మే మంచిది'' అనుకున్నారు. సహస్రమాసజీవి అయినా దుర్గమ్మ పెద్దమ్మకు రాగద్వేషాలు అణగకపోగా మంచి పదునుగా వున్నాయి. ఆమె నాల్కను ఆడిస్తున్నాయి. దూషణ చేయటానికి వోపికా తగ్గలేదు.

''బస్సు అందుకోవాలి. పోదామా? అందరూ తినటమైందా? కడిగి బోర్లించి పోదాము'' అని లేచింది బాల.

పమిట దిద్దుకుంటూ దోపుకుంటూ లేచింది కుంతల.

''పోదాం. మరీ రాత్రి పడకముందు విడిదిలో వుండాలి నేను. ఇంతసేపెక్కడున్నావే? యేం చేస్తున్నావే అని అమ్మ నాబుగ్గలు పిండుతుంది.''

నేల శుభ్రం చేసి చాపలు మడిచి మూలపెట్టారు.

''మామ్మా! మళ్లా వస్తాం. మా పెళ్లికి తీసికెళ్లటానికి వస్తాము. కోపం పెట్టుకోకు'' అన్నది బాల.

వాళ్ల తలలు నిమిరి తన కణతలకు మెటికలు విరుచుకున్నది దుర్గమ్మ పెద్దమ్మ.

''మీకన్నా అటువంటి ఆలోచన వచ్చిందే పిచ్చి కట్టెల్లారా! శక్తివుడిగిన దాన్నెవరు పిలుస్తారు? తప్పక వస్తా'' అని కష్టసాయంతో లేచింది దుర్గమ్మ.

రెండువేపులా ఆసరా యిచ్చారు పిల్లలు.

''పదండిపోదాం. తాళం చెవి యిటియ్యండి. మళ్లాయెప్పుడో యీ చిన్న సన్నాసుల్ని కలుసుకునేది! దుర్గమ్మ గుర్తురావచ్చిందీ!'' అని పిల్లల వెంట సంతోషంగా నడిచింది దుర్గమ్మ.